


Illustration: Anwar

# డిపెండెంట్

హనీఫ్

కథ

ఎప్పటిసందో వద్దాం వద్దాం అనుకుంటనే వాయిదాల మీద వాయిదాలు వేసుకుంట రాలేకపోయిండు. ఎప్పుడూ ఏదో ఒకె వత్తిడి, తండ్లాట. మనసులేని అవిటితనం. జనం మనసులేనోణ్ణి అవిటోడు అంటారా? అంటరోగింటరో గని నేను మాత్రం మనసు లేనితనాన్ని అవిటితనమే నంట. ఆ అవిటితనంవల్లనే తను ఇన్నాళ్ల వరకు రాలేకపోయిండు. సావు కబురో, సావులాంటి కబురు మాత్రమే లాక్కొని వచ్చిందిక్కడ దన్క. సింగరేణి మెయిన్ హాస్పిటల్ క్యాజువాలిటీ ముందు జనం మస్తుగ గుమిగూడి ఉన్నరు. బొగ్గు బాయిలల్ల ప్రమాదాలు జరిగినపుడు ఇట్లా రావడాలు తనకు కొత్తేమి కాదు. తనలాగే అందరూ లాక్కోరాబడ్డవాళ్ళే. పోరనికి బాయిల ఉద్యోగ మొచ్చి ఐదారేండ్లు నిండలే. బాయిల పని చేస్తుండగ బండ పర్దా కూలి కాళ్ళు నలిగిపోయినాయంట. తోటోళ్ళు ఇద్దరు అక్కడికక్కడే పానం ఇడిసింద్రు. ఏం బతుకులో ఏమో ఎన్నాలు బతుకతమో గ్యారంటీ లేదు. పోరడు అవిటోడైండని ఫోన్ల కబురొస్తే అన్న కొడుకును సూసిపోదామని రాత్రికి రాత్రే బైలెల్లి వచ్చిండు. తనని చూడంగనే వదిన, అన్న, పిల్లలు గొల్లుమన్నారు. ఎంత ఆపుకుందామన్నా దుఃఖం ఆగట్లేదు. తను కూడా ఏడ్సిండు. జరసేపైనంక తనే "ఎట్లా అయిందంటా?" అడిగిండు.

అప్పుడే దగాయించిన గులాయిలోకి సేఫ్టీ అది ఏమీ చేయకుండా ప్రొడక్షన్, ప్రొడక్షన్ అని పోరగాల్లని ముందుకు తోసి ఫిల్లింగ్ చేయమన్నరంట. గతే, గట్లపోయి పని సురూ జేసిన్లో లేదో పైనుంచి బండపర్దా కూలింది. బిడ్డలు ఆ పర్దాకిందనే ఇరుక్కోబోయిన్లు" అన్నడు అన్న.

"ఎంత మందికి దెబ్బలు తగిలినయి?"

"ఇద్దరు అక్కడికక్కడే చచ్చిన్లు, మనోడికి రెండు కాళ్ళు ఇర్గిపోయి అవిటోడైపొయిండని" దుఃఖం ఆగబట్టలేక మల్లా గొల్లుమన్నడు.

ఒక్కగానొక్క కొడుకు అన్న చానా ఆశలు పెట్టుకున్నడు. చదివిద్దాం అంటే పోరడు ఆవారాగాళ్ళ సోపతి పట్టి సదువు బుర్రకెక్కలే. జులాయిలాగ వీధుల పట్టి తిరిగిండు. ముప్పూటలు తిని కండలు పెంచిండుగని సదువు అబ్బలేదు, పైగా "అయ్యపని దిగిపోయినంక అయ్య డ్యూటీ ఎక్కుతా" నని చెప్పుకుంట బేఫరోసాగా పెరిగిండు. సింగరేణి కంపిన్ల డిపెండెంట్ ఉద్యోగాలు ఇచ్చుడు వుండబట్టి సగానికి సగం మంది పోరగాళ్ళు ఇదే తంతు. అయ్యలు భూమి పాతాళంలోకి పోయి రక్తాన్ని పిండి సంపాదించి తెస్తే కొడుకులు దుబారాగా తిరిగి గొడవలు కొనితెస్తుంటారు.

"ఏం ఫాయిదైంది, చదువుకుంటే ఏదన్నా బైట పని చేసుకొని దర్జాగా బతకొచ్చు. దినదిన గండం, బొగ్గు బాయిలోకి దిగినంక బతికివస్తమో, చచ్చి శవమై వస్తామో వచ్చేదన్క నమ్మకం లేదు. జారుడు బండ తీర్గ దిగుడు బావులు గర్మి గులాయిల నడుమ మాంసం ఉడికించినట్లు బాయిల మనిషి కుతకుతా ఉడికిపోతడు. గాలుండదు, వెల్తురుండదు, కోసులకొద్ది కాలినడక, మనిషి నిటారుగా నిలబడటానికే వీలులేక స్వరంగ మార్గాలు, "వీపుల మీద బొగ్గు తట్టలు మోయాలి, రెండు టబ్బులు నింపితే కాని ఆ రోజుకు జీతం చేతికొచ్చినట్టు. ఏం పీక్కోతింటానికి పొరగాళ్ళు బతుకులు ఈ ఉద్యోగాలకు ఎగబడి ప్రాణాలు వడ్డుతున్నారు. క్యాజువాలిటీ ముందున్న చెట్టుకింద ఉన్న అరుగుపై కూర్చుండి ఆలోచిస్తుండు రాజీరు. అన్న, వదిన పిల్లలు మళ్ళీ ఏడుస్తున్నారు. ఆ ఏడ్పుల గోలకి ఆలోచనల నుంచి బైటపడి ఏమైందన్నడు?" కాళ్ళు నుజ్జు నుజ్జైపోయి పాయిజన్ అయినై. కాళ్ళు తీసేయకుంటె పోరడు బతకడంటున్నారు డాక్టర్లు" ఏడుస్తూనే చెప్పింది వదిన.

క్యాజువాలిటీ ముందు పరిస్థితి అంతా ఆందోళనగా ఉంది. ఎవళ్ళకు తోచిన విధంగా వాళ్ళు తమ, తమ సలహాల్ని ఇస్తున్నారు. అంతా గందరగోళంగుంది. మాటలు రానితనం, గుంపుల నుంచి ఎవరో "ఏమన్నా పోరగాన్ని సంపుకోతింటవాఏంది. బొందిలో ప్రాణముంటే చాలు బిడ్డడు ఇంటిముంగులుంటడు. వద్దని కాటికి పంపుతావా? జప్పున చెప్పరాదు మల్ల" అన్నడు.

"గెట్లైతే, గట్లనే అయితది, సరే కానీయమన్నడు. బిడ్డడన్నా కన్లముంగలుంటడు" అన్నడు.

డాక్టరు తమ పని తాము కానిచ్చి పోరని పానాలు నిలబెట్టిన్లు. రెండు మూడు రోజులకుగ్గాని పరిస్థితులు కుదటబడ్డంలేదు. ఇంట్ల కరెంటు బుడ్లు ఎల్గుతున్నపుడల్లా, టీవీలు చూస్తున్నపుడల్లా, కూలర్లు, ఫ్యాన్లు తిరుగుతున్నపుడల్లా ఈ కరెంటు వెల్తురు కోసం ఎందరో కార్మికులు కాళ్ళు, చేతులు, ప్రాణాలు సుదా పోగొట్టుకున్నరని ఎందరికి తెలుస్తది.

రాజీరు వచ్చి వారం దాటబట్టింది. వెల్దామంటే మనసు వప్పుతలేదు. అన్నా, వదిన పుట్టెడు దుఃఖంలో ఉన్నరు. ఎంత చెప్పి చూసినా ఏడుపు ఆపుతలేరు. దిగులుగా కూసుంటున్నరు. ఇంటికి వెళ్తానని చెప్పలేకపోతున్నడు. ఇంట్లనే వుండలేక బొంబాయి కాలనీ సెంటర్లకు వచ్చిండు రాజీరు. ఎవలైనా తెల్సినోళ్లు కన్పిస్తరా అని అటు ఇటూ తేరపారంగ చూసిండు. అంతగా జనం లేరు. పొద్దటి బదిలోళ్ళు డ్యూటీలకు పోయివుంటరు. సెంటర్ల అంతగ జనం లేరు పల్చగున్నరు.

సింగరేణి కంపిన్ల క్వాటర్స్ కట్టిచ్చిన చోటల్ల ఆఫ్‌స్టేర్ కోటర్స్ కట్టిచ్చి దానికి బొంబాయి కాలనీ అని పేరు పెడ్తరు కంపినోల్లు. బొంబాయి దేనికి ఆదర్శమో అంతు చిక్కడం లేదు.

ఈ కోటర్స్ చూసినోడికి బొంబాయిల మధ్య తరగతి కుటుంబాల బతుకులు ఎట్లుంటవో ఇట్లనే తెలుస్తది. చిన్న, చిన్నవి రెండే గదులు, వాటి కానుకొని కిచెన్, కిచెన్ గలమకానుకొని పాయిఖానా దొడ్డి వుంటది. మొత్తంగా చూసినా ముల్లుగర్ర పొడుగు, ముల్లుగర్ర వెడల్పుల మొత్తం కోటర్స్‌ను ఇరికిచ్చి, ఇరికిచ్చి గట్టిండు కంపినోడు. అందులోనే ఇంటిల్లిపాదలు వుండాల. అమ్మయ్యండాల, పిల్లలు కాస్త పెద్దోళ్లై పెండ్లీంళ్ళు అయితే కొడుకు కొడళ్ళుండాల. అందుకే కంపినోడు అగ్గిపెట్టె సైజుల కోటర్స్ కట్టి వాటికి బొంబాయి కాలనీ అని పేరు పెట్టిండనిపిస్తది.

రాజీరుకు ఐదారేండ్ల క్రిందట గోదావరిఖనికి బదిలీ కాకమునుపు ఇదే కాలనీలో వుండెటోడు. అప్పుడున్న కోటర్స్ పక్కనున్నవాళ్ళు, తాము మంచిగా సోపతిగ వుండేటోళ్ళు, వాళ్ళు గుర్తుకొచ్చి అయిలమ్మ అక్కను పలకరించి వద్దామని అటువైపు బైలెల్లిండు.

ఐలమ్మ మొగుడు ఓపెన్ కాస్ట్‌లో పనిచేసేటోడు. బాయిల యాక్సిడెంట్‌లో భర్త చనిపోయినంక, ఇద్దరు బిడ్డలను సాదనీకి యమ యాతన పడింది. మొగుడు పోయినందుకు కంపిన్ల ఐలమ్మకు ఉద్యోగమిచ్చిన్రు. భర్త చనిపోయినందుకు పి.ఎఫ్. దబ్బులు, సర్వీస్ డబ్బులు బాగనే వచ్చినయ్. ఆ డబ్బులు ఆమెకాడ యాక మిగిలినయ్ కాకులు తన్నుకోపోయినట్లు, ఫలారంలా పంచిపెట్టి వుత్తిచేల్తుతోటి మిగిలింది. అదో పెద్ద కథ. మర్దులు, సుట్టాలు, పక్కాలు, అప్పులోళ్ళు ఇంటిమీదికి ఎగబడిరి, వచ్చిన కాడికి ఫలారం పంచినట్లు పంచిపెట్టింది. బతకడానికి ఉద్యోగం వుంది గదాని దయిర్నం పడింది.

ఉద్యోగంలో చేర్న దగ్గర నుంచి ఇక మొదలైనయి బాదలు అప్పటిదనక్క ఇంట్ల నుంచి కాలు బయటపెట్టి ఎరుగదు, ఏ దుకానం మొగమెరుగదు, మార్కెట్లకు పొయ్యేద్దితెల్వదు. అంతా మొగుడే చూస్కునేటోడు. ఇక తన నెత్తిన పడేటప్పటికి తెగ పరేషన్ అయ్యేడ్డి. ఇక వర్క్‌షాప్‌లో స్వీపర్ ఉద్యోగం ఇచ్చిన్రు కంపినోళ్ళు. ఊరవతల చానాదూరంగున్నది పోయివచ్చుడు చాలా కష్టబడేడ్డి. ఇక పనిదెగ్గర జులాయిల గొడవ తోటి బేజారెత్తిపోయేడ్డి, తోటి కార్మికులే బనాయించుడు, సైగల్ చేసుడు. రెండో పెండ్లాంకింద వుంచుకుంటనన్నోడేనాయే. పాపం ఆడకూతురు పిల్లల్ని సాదనీకి ఏదో యాతన్లు పడుతుంది. చాతనైనంత సాయత పడుదాం. దైర్నం చెబుదాం అన్నోడే లేదు. ఒక పాలి ఎవరో ఒకడు చేయిపట్టుకున్నడని ఆత్మహత్య చేసుకోవడానికి సిద్దపడ్డది. నా పెండ్లాం పక్కపొంటి వుండకపోతే అన్నంత పని చేసేడ్డి. మేమిద్దరం ఎంత సముదాయించి లోకం సంగతి తన బిడ్డల కోసం అన్నీ తప్పవని ఎన్ని సర్దిచెప్పి అడ్డుపడ్డం. ఐదేండ్లైపోయా ఇటు మొకరాక ఐలమ్మ అక్క ఎట్లున్నదో... ఆలోచిస్తూ నడవబట్టిండు రాజీరు.

వీధెం మారలే గట్లనే వుంది, ఒకరిద్దరు ఇండ్లల్ల వుండే పలకరించిన్రు. అందరితోటి మాట్లాడుకుంటనే అయిలమ్మ ఇంటిముందుకొచ్చి ఆగిండు. ఇంట్ల అయిలమ్మ వున్నదోలేదో అలికిడేం లేదు. తలుపు దెగ్గరికి వేసి వుంది. కాలింగ్‌బెల్ నొక్కిండు కొద్దిసేపటికి తలుపు తెర్చుకుంది.

“అక్కా బాగున్నవా?” పలకరించిండు రాజీరు.

“ఎప్పుడు వచ్చినవు తమ్ముడు ఇంట్లకిరా”

> ‘ఏం ఫాయిదైంది, చదువుకుంటే ఏదన్నా బైట పని చేసుకోని దర్జాగా బతకొచ్చు. దినదిన గండం, బొగ్గు బాయిలోకి దిగినంక బతికివస్తమో, చచ్చి శవమై వస్తామో వచ్చేదన్క నమ్మకం లేదు. జారుడు బండ తీర్గ దిగుడు బావులు గర్మి గులాయిల నడుమ మౌనం ఉడికించినట్లు బాయిల మనిషి కుతకుతా ఉడికిపోతడు.

అని సాదరంగా పిలిచింది.

“ఎట్లున్నరక్కా?”

“మంచిగనే వున్నం, ఒక్కనివే వచ్చినావ్ సారక్కని, పిల్లల్ని తీస్కరాకపోయినావు. అందర్ని చూడక చాన్నాళ్ల ఆయే!” అంది.

“సుట్టపుసూపుగ యాదొచ్చిన, అన్న కొడుక్కి యాక్సిడెంట్ ఆయెనంటే చూడడానికి వచ్చిన” అన్నడు.

“అయ్యో బిడ్డా. ఎట్లున్నడు? నేను వారం రోజుల సంది ఊర్లలేను హైదరాబాద్‌లో పిల్లలు సదువుతున్నరు గదా ఆడికిపోయి ఈరోజు పొద్దుగాలనే వచ్చిన” అంది.

“నుజ్జు నుజ్జెనయి అని రెండు కాళ్ళు తీసేసిన్రు, ఏడుపులు, పెడబొబ్బలుగుంది. అన్న పరేషాన్ అయిపోతుండు. ఏం చెప్పి దైర్నం చెప్పాలో బోదపట్టం లేదు” ఇద్దరి మధ్య



మౌనం. ఎవలు మాత్రం ఏమంటరు. అనేతందుకు ఏం మిగిలింది. జరైయినంక ఇప్పుడే వస్తనని ఇంట్లకు పోయింది. వంటగదిలోకి పోయినట్లుంది. ఫ్రిజ్‌లోంచి చల్లటి నీళ్ళ బాటిల్‌తో బయటికొచ్చి నీళ్ళు తాగమని చేతికి అందించింది. నీళ్ళు తాగడం అయినంక “డ్యూటీ ఎట్టున్నదక్క?” అని అడిగిన.

“ఎట్టుంటది నీకు తెలియని విషయాలు ఏమున్నయ్. పెనం నుంచి జారి పోయిలో పడ్డట్లు వుంది బతుకు” అంది.

“అంటే...ఇంకా...?”

“పాత విషయాలు వదిలేయ్. మనం దుత్ అని అదిలిస్తే పారిపోయి తోక ముడుస్తాయి. అవి నాకేం చేస్తయ్” స్థిరంగుంది గొంతు ప్రతి చిన్న విషయానికి తెగ బాధపడిపోయి హడలెత్తిపోయేది, హైరాన పడేది. అప్పటి ఐలమ్మకు ఇప్పటి ఐలమ్మకు పొంతన ఎక్కడా అడుపడ్డం లేదు. ఆమెలో ఈ మార్పుకు సంతోషమనిపించింది తనకు.

“మరి...!” మాట పూర్తికాక మునుపే...

“కంపెనీ దొరలు, యూనియనోళ్ళు మమ్మల్ని యాడబతుకనిత్తున్నరని నిలువనీడ లేకుండా చేయడానికి కంకణం కట్టుకున్న తీర్గ పరేషాన్ జేత్తున్నరు, నిలబడనిత్తున్నరా?” అని ఆగింది.

“కంపినోళ్ళు సరే మన ఊనియనోల్లు ఏం జేత్తున్నరు వాళ్ళను కూడ కలిపి తిడుతున్నవు” అన్న.

“అగ్గో, తెలియనట్టే మాట్లాడబట్టివి, అసలు కంపెన్ల ఆడోళ్ళ కొంప ముంచిందే వాళ్ళు నయ్యా” అంది ఆవేశంగ.

“అసలు కంపిన్ల ఆడోళ్ళకు ఉద్యోగాలు ఇవ్వద్దని ఎగ్రిమెంట్ చేసిందే వాళ్ళేనాయే, ఇంకా ఏం జేసిన్లు అంటున్నవేంది. మొగుళ్ళను సంపుకో తిని ఆడోళ్ళంతా దబ్బులు మూటగట్టుకొని, మిండేండ్ల వెట్టుకొని తిరుగుతున్నరని గదా ఆరోజు ఆ పని జేసింది” అంది.

“అందుల వాస్తవం లేదంటవా?” అన్నడు రాజీరు.

“కంపిన్ల లక్షకు పైచిలుకు కార్మికులు వున్నరు గదా అంత మందిలో ఎన్నివేలమంది మొగుళ్ళను ఆడోళ్ళు సంపుకో తిని కులికిన్రు చెప్పు. ఏ ఒక్కరో ఇద్దరో తాగుబోతు మొగుళ్ళు, ఏడాది పొడుగూత వందమస్టర్లు సుదా పూర్తి చేయనోడు, పెండ్లాన్ని, పిల్లల్ని ఏం బెట్టి సాత్తడు. వాళ్ళ కడుపొకలి వుసురు పోసుకొని తాగి తాగి ఊపిరి తిత్తులు తూట్లు పడి వాడు సత్తే అట్లాంటోడి సావుని పెండ్లాల మీద అంటగట్టి ఆడోళ్ళందర్ని బలిపశువుల్ని చేస్తారు. ఎవరిచ్చిన్రు పెత్తనం” అని నిలేసింది.

“తండ్రుల ఉద్యోగాల ఆశచూసుకొని ఏమీ చదవకుండా కండలు పెంచుకొని రౌడీల్లాగ తిరిగినోళ్ళు, తండ్రి తొందరగా దిగిపోయి ఉద్యోగం తనకిత్తలేదని ఎంతమంది కొడుకులు తండ్రుల సంపి

ఉద్యోగాలు చేసేటోళ్ళులేరు. అట్లాంటి కొడుకులకు సుదా ఉద్యోగాలివ్వద్దని ఎగ్రిమెంట్ ఎందుకు చేయలేక పొయింద్రు. మొగోళ్ళ మని పక్షపాతమేగా అడ్డు తగిలింది. మాకైతే ఒక నాయం, మీకైతే ఒక నాయమా?" అయిలమ్మ ఆవేశంగుంది.

ఏం చెప్పాల్నో అర్థం కావటం లేదు. అయిలమ్మ ఇన్ని మాటలు యాడనేర్సినట్టుంది అని ఆలోచిస్తూనే, ఏం చెప్పాలా అని వెదుకుతున్నాడు. ఏమీ పాలుపోలే దీర్ఘాలోచనలో పడ్డాడు రాజీరు. రాజీరు కూడా కంపిన్ల ఒక చిన్నపాటి లీడరే, అయిలమ్మ మాటలు గుండెల్లో సూదులు మాదిరిగా గుచ్చుకుంటున్నాయి. మళ్ళీ అయిలమ్మ అందుకుంది.

"దీనికి తోడు యమస్పీడుగ వస్తున్న ప్రవేటీకరణ, సరళీకృత ఆర్థిక విధానాల వల్ల ఆడోళ్ళ ఉద్యోగాలు ఊడబెరకడానికి అన్ని ప్రయత్నాలు చేస్తుంది. యాజమాన్యం ఊడ్చేపని దెగ్గరినుంచి అన్ని పనులు కాంట్రాక్టర్లకిచ్చి మానోట్లో మట్టి గొడుతున్నారు. ఇదేమంటే, మాదెగ్గర పనిలేదు, మీరు ఏది పడితే అది చేయాల్సిందే లేకుంటే ఇంటిదారి పట్టండని ఆడోళ్ళని కూడా చూడకుండా అలిమి కాని పనులు చెపుతున్నారు. "చట్టసభల్లో ఆడోళ్ళకి ముప్పైమూడు శాతం రిజర్వేషన్స్ తెస్తానని తెగలెచ్చర్లు దంచుతున్నారు. కూలిపని చేసుకోవడానికి సుదా కొరకాకుండా బోతున్నారు. మగదిక్కులేని ఆడోళ్ళంతా ఏంచేసి బతకాలె. పిల్లలకింత ఇసంపెట్టి తనింత ఇసం మింగి సచ్చుడేనా? ఏం తమ్మీ మాట్లాడవు".

"ఇగచూడు, ఇప్పుడు జరిగిన యాక్సిడెంట్ల ఇద్దరు సచ్చిండ్లు, మీ అన్న కొడుక్కి కాళ్ళు లేకపాయెనా. ముగ్గురికి కంపిన్ల పని చేయబట్టి పదేండ్ల సర్వీస్ నిండకపాయే. మంచి వయసు మీదున్న పోరగాండ్లు అన్యాయమైపోయే. ఇందుల మీ అన్న కొడుకు సంగతే చూడు కాళ్ళు లేకుండా అవుటోడు ఆయేనా, తండ్రి పని దిగిపోయి కాటికి కాళ్ళు సాపుకొని కూసున్నాడాయె, మగదిక్కులేని కుటుంబం ఎవరు ఆదుకోవాలే. మీ అన్న కోడలు ఇద్దరు సంటి పిల్లల తల్లి ఇంట్ల ఉద్యోగం చేసేటోడు లేడు, అవిటోడికి పని ఇయ్యరాయే. ఉన్న ఆడామెకి ఉద్యోగం ఇయ్యరాయే, ఏం చేసి ఆ కుటుంబాన్ని పోషించాలి, అన్యాలం అయిపోవుడేనా చెప్పు".

"ఆ రోజుల్ల నాకు పని ఇయ్యబట్టేగదా, ఇద్దరు పిల్లల్ని మంచిగ సదివించుకొని పరువుగా బతికింది. లేకుంటే నా పిల్లలు, నేను ఏమైపోయేటోళ్లం ఆగమాగమైపోయేటివి మా బతుకులు. కంపిన్ల వున్న సంఘాలన్ని కలిసి ముదనష్టపు ఎగ్రిమెంటు కంపినోళ్ళతో చేసుకొని ఏం బావుకున్నరు. ఆడోళ్ళ బతుకుల్లో తట్టెడు మన్ను గొట్టిండ్లు".

నిజంగానే ఎవడు ఆలసిస్తుండు ఇదంతా. మానవ సంబంధాలన్నీ డబ్బు రాశుల ముందు ఎందుకు కొరగాకుండా పోతున్నాయ్ బాధలు, బంధాలు ఎవరు పట్టించుకుంట లేరు. గ్లోబలైజేషన్ ముసుగులో మార్కెట్ల మధ్య దూరాలు తగ్గిపోతున్నాయి కాని మానవ సంబంధాల మధ్య యోజనాల దూరం ముప్పెటగా పెరిగిపోతుంది. రాజీరు ఏం చెప్పాలా అని ఆలోచిస్తున్నడు. "అక్కా ఈ అన్యాయానికి వ్యతిరేకంగా మీరు ఒక కార్యక్రమం తీసుకోండ్లి. ఇదే మంచి అదును, తీగలాగండి డొంకంతా కదులతది. ఆడోళ్ళందర్ని కూడగట్టి, అంటే మీ చాతనైనంత మంది చివరాఖరికి ఓ పాతిక, ముప్పై మందిని కూడగట్టి మీకు తోచిన కార్యక్రమం చేపట్టండి. ఎనుక మేముంటం, కలిసొచ్చినోళ్ళనల్లా మేం కలుపుకొని బాసటగా నిలుత్తం. ఏదో ఒకటి ఫైసలా అయితది" అని పని వప్పచెప్పి మళ్ళీ వస్తానని ఇంటిముఖం పట్టిండు రాజీరు.


నడుస్తున్నడు పక్కపొంటి ఎవరెవరు వెల్తున్నరో గమనిత్తలేదు. అయిలమ్మే కండ్లల్ల పటం కట్టి నిల్చుంది. అందరు ఆడోళ్ళు తతీగ్గనే సాదాసీదా ఇంటిపట్టునుండే ఆడమనిషేనా? బలేగ మారిపోయింది. లీడర్ లెక్కన అగుపిత్తంది తన కండ్లకు, ఇంకేం కావాల. పెండని కాదు రాయిని తన్ని ముప్పై ముక్కలు చేసే లెక్కన తయారైంది.

# లోపలి బయలు

ఆరిన కన్రెప్పలు తడితడిగా కదిలినట్టు
నిద్రించిన నెత్తురు దమ్మనగ్రోవి నుంచి పారినట్టు
ఓటిపోయిన దేహభాండం తిరిగి అతుక్కున్నట్టు


లేననుకున్న నేను
కనుగొన్న నేను

విసిరేసిన పాట లోపలికే చేరినట్టు
ఒంటికతుక్కున్న చర్మం పాప్ మ్యూజిక్కైనట్టు
అబార్షన్ అయిన కల ఊపిరి పోసుకున్నట్టు
నేలకొరిగిన నింగి నిటారుగా నిలబడ్డట్టు



మెరుపులనేకం
మబ్బులనేకం
గుర్తైన కన్ను ఒక్కటే


పాడిన చెక్కిలులెన్నో
వాడిన పెదవులెన్నో
స్పర్శించే తంత్రి ఒక్కటే



ఇసుక తుఫాన్‌లో నేను
ఒక్క చిలకరింత

శీతలత్వ చెరువులో నేను
మరొక్క పలవరింత

వంద పాదాల నృత్యం
వెయ్యి పతనాల దృశ్యం
దిల్ ఏక తారా



పులుల విరామంలో
కుందేలు పిల్ల నవ్వు

పదసవ్వడి లేని పెదాలహోరు
పెదాల ప్రమేయంలేని
పదప్రవాహం
ఒకే ఒక్క చెవి

శిశిర చిహ్నాలతో నేను
రాలిన చోటే రత్నాంకురం

వెయ్యి పుప్పొడులు కళ్ళను కమ్మినట్టు
కాలం కలకండగా మారినట్టు
చిక్కువిప్పిన వేళ్ళు లాలనగా గ్రీట్ చేసినట్టు
దేవులాడుతున్న కళ్ళు ఉశిక కుప్పలో దొరికినట్టు
దాచి పోగొట్టుకున్నది దారితప్పిన చోటే తగిలినట్టు
పోగొట్టుకుని దాచినది మారినచోట మార్మికమైనట్టు

లోపలి బయాలూ బయటి లోపలా

- సుంకిరెడ్డి నారాయణరెడ్డి